క్లుప్తంగా

దొనకొండ ఏపీఓగా కళ్యాణి

దొనకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓగా కళ్యాణి గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈమె దర్శి నుంచి దొనకొండకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏపీఓగా విధులు నిర్వహించిన టి.దేవయ్య కురిచేడుకు బదిలీపై వెళ్లారు. గ్రామాల్లోని ఉపాధి కూలీలకు వెంటనే వేతనాలు చెల్లించేలా తాను కృషి చేస్తానని ఆమె చెప్పారు.

గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

తాళ్లూరు: గృహ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ పి.శ్రీనివాస ప్రసాద్ సూచించారు. మండల కేంద్రం తాళ్లూరులో గృహ నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. మండలంలో 144 మంది ఎస్టీ, ఎస్సీ, బీసీ లబ్ధిదారులున్నారని, అదనపు సాయంగా ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు అందించి జూన్ 1వ తేదీలోపు గృహ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఈ హనుమంతురావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలోని మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎమ్ఈసీ గ్రూప్‌ల్లో సీట్ల భర్తీకి మే 22వ తేదీలోగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 దరఖాస్తు ఫీజు చెల్లించాలని సూచించారు. 10వ తరగతిలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ రూల్స్ ఆధారంగా సీట్లను కేటాయిస్తామని స్పష్టం చేశారు. వివరాలకు 95428 78916, 95023 35251, 91776 72171ను సంప్రదించాలని సూచించారు.

గిద్దలూరులో శాంతియుత ర్యాలీ

గిద్దలూరు రూరల్: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ఉన్నత స్థాయిలో పారదర్శకంగా విచారణ చేపట్టాలని పలువురు పాస్టర్లు డిమాండ్ చేశారు. గురువారం గిద్దలూరులో క్రైస్తవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులకు, పాస్టర్లకు క్రైస్తవ వ్యతిరేక శక్తుల నుంచి రక్షణ కల్పించాలని, మత విద్వేషకులను శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు శామ్యూల్, నారాయణ, జాషువా, కరుణ, ఫిలిప్, చంద్రశేఖర్, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో అభివృద్ధి పనుల పరిశీలన

కంభం: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంలో భాగంగా చేపట్టిన కెమిస్ట్రీ ల్యాబ్, ప్లే గ్రౌండ్స్, స్కౌట్స్, గైడ్స్, ర్యాంప్ పనులను గురువారం ఎంఈఓ శ్రీనివాసులు పరిశీలించారు. పీఎంశ్రీ నిధులు మౌలిక వసతుల ఏర్పాటుకు, పాఠశాల అభివృద్ధికి ఉపయుక్తంగా ఉంటాయన్నారు. పనులను పారదర్శకంగా చేపడుతున్న ప్రిన్సిపాల్ చాముండేశ్వరిని అభినందించారు.

నాటుసారా బట్టీ ధ్వంసం

గిద్దలూరు రూరల్: మండలంలోని బురుజుపల్లి గ్రామ పరిధిలో గురువారం ఎక్సైజ్ అధికారులు నాటుసారా బట్టీని ధ్వంసం చేశారు. 100 లీటర్ల బెల్లపు ఊటను పారబోసి, నిందితుడిపై కేసు నమోదు చేశారు. నాటుసారా తయారీ, రవాణా, క్రయవిక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు హెచ్చరించారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ యూసఫ్ షరీఫ్, సిబ్బంది శ్రీపతి, రహ్మతుల్లా, అసదుల్లా పాల్గొన్నారు.

బ్రాండెడ్ బ్యాగుల్లో రేషన్ బియ్యం

- గ్రామాల్లో తిరిగి ముమ్మరంగా అమ్మకాలు
- మోసపోతున్న ప్రజలు



రేషన్ బియ్యంతో నింపి ఉన్న నకిలీ బ్రాండ్ బియ్యం బస్తా

యర్రగొండపాలెం: బ్రాండెడ్ బ్యాగుల్లో రేషన్ బియ్యం నింపి సరికొత్త మోసానికి తెరలేపారు. ప్రముఖ బ్రాండ్‌కు చెందిన కంపెనీ పేరు ప్రారంభంలో ఉన్న శ్రీ అనే అక్షరాన్ని తొలగించి ఆ బ్రాండ్ పేరుతో 50 కిలోల బ్యాగుల్లో రేషన్ బియ్యం సీజ్ చేసి అమ్మకాలు జరుపుతున్నారు. బొలెరో వాహనంలో బియ్యం బస్తాలు పెట్టుకొని మార్కెట్ ధర కంటే తక్కువకు అమ్మకాలు జరుపుతున్నట్లు ప్రచారం చేసుకుంటూ కొంతమంది ఈ వ్యాపారాన్ని ప్రారంభించారు. ముందుగా ఒక బస్తాలో నింపి ఉన్న సన్న బియ్యం శాంపిల్‌గా చూపించి మంచి క్వాలిటీ అన్న నమ్మకాన్ని ప్రజలకు కలిగిస్తున్నారు. హడావుడిగా కొన్ని బస్తాలు అమ్మకాలు జరిగిన తర్వాత వారు అక్కడి నుంచి ఉడాయిస్తున్నారని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు తెలిపారు. అన్నం వండుకునేందుకు ఆ బియ్యం బస్తాలు విప్పి చూస్తే రేషన్ షాపుల్లో ఇచ్చే బియ్యం కనిపిస్తున్నాయని, వాటిని వండుతుంటే అన్నం ముద్దగా మారుతుందని చెబుతున్నారు. సోనామసూర మార్కెట్‌లో క్వింటా దాదాపు రూ.5,500 వరకు ధర పలుకుతోంది. వీరు క్వింటా రూ. 4 వేల ప్రకారం అమ్మకాలు జరుపుతున్నారు. క్వింటాపై రూ. 1500 తగ్గుతుండటంతో ప్రజలు ఆశపడి ఆ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. రేషన్ బియ్యం కొనుగోలు చేసి దూర ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. ఆ బియ్యం మిల్లులకు చేర్చి పాలిష్ చేసిన తర్వాత 25 కిలోల బ్యాగుల్లో నింపి సోనామసూర బియ్యం పేరుతో అమ్మకాలు జరుపుతున్నారు. అందులో కనీసం 40 శాతం క్వాలిటీ బియ్యం ఉంటాయి. దీంతో వ్యాపారులకు ఖర్చు పెరుగుతుంది. అంతేకాకుండా అన్నం పూర్తిగా ముద్దకాకుండా కొంతమేరకు బాగానే ఉంటుంది. ఒక వేల అన్నంలో తేడా వస్తే కొత్త బియ్యం కావడంతో అన్నం ముద్దగా మారుతుందని, కొన్ని రోజుల తర్వాత అవి పాతపడిపోతాయని నమ్మకంగా చెబుతున్నారు. ప్రస్తుతం దీనికి భిన్నంగా మోసగాళ్లు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన గోతాలను ఎంచుకొని వాటిలో నేరుగా రేషన్ బియ్యం నింపి అమ్మకాలు జరపడంతో ఖర్చు లేకుండా ఆదాయం దండిగా వస్తోంది.

ఈ మార్గాన్ని ఎంచుకున్న అక్రమ వ్యాపారులు మండలంలోని నరసాయపాలెంలో బొలేరో వాహనంతో వచ్చి బియ్యం అమ్మకాలు జరిపారు. కొన్ని బస్తాలు అమ్మకాలు జరిగిన తర్వాత వారు అక్కడి నుంచి ఉడాయించారు. శ్రీ అన్నపూర్ణ కంపెనీకి చెందిన బ్యాగులు ఎల్లో రంగులో ఉంటాయి. ఆ కంపెనీకి ప్రధాన పట్టణాల్లో ఏజెంట్లు కూడా ఉన్నారు. క్వాలిటీ బియ్యం అక్కడ దొరుకుతాయన్న నమ్మకం ప్రజల్లో ఉంది. ఆ బ్రాండ్‌కు చెందిన బియ్యం ఖరీదు కూడా బాగానే ఉంటుంది. దీన్ని ఆసరా తీసుకొని అక్రమ వ్యాపారులు శ్రీ అనే అక్షరాన్ని తొలగించి అన్నపూర్ణ పేరును తెల్ల బ్యాగులపై ముద్రించి అందులో రేషన్ బియ్యం నింపి తక్కువ ధరకు అమ్మకాలు జరుపుతున్నారు.

మాట తప్పిన కూటమి ప్రభుత్వం

- ఆరు నెలల్లో ఉద్యోగ నోటిఫికేషన్ ఇస్తామన్న నారా లోకేష్
- 9 నెలలు దాటినా పట్టించుకోని ప్రభుత్వం
- డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య



మాట్లాడుతున్న కేవీ పిచ్చయ్య

దర్శి: కూటమి ప్రభుత్వం మాట తప్పిందని, ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల్లో ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇస్తామని మోసం చేసిందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య విమర్శించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్షల తేదీ ప్రకటించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు, యువతతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ పిచ్చయ్య మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కోర్టు కేసులు క్లియర్ చేసి పోస్టులు భర్తీ చేస్తామన్నారన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా అతీగతి లేదని లోకేష్‌ను ఉద్దేశించి విమర్శించారు. కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, మూడు పార్టీలు కలసి అభ్యర్థులకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారన్నారు. సుప్రీం కోర్టులో ఉన్న కేసులు పరిష్కరించి పాత పద్ధతిలో రిజర్వేషన్ నిర్వహించి కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేసి చలో విజయవాడకు పిలుపునిస్తామని హెచ్చరించారు. డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఆర్ జేసీపాల్, మండల నాయకులు షేక్ పీరాసాహెబ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు మేలు చేసిన అకాల వర్షం

- వేసవి పత్తి విత్తుకునేందుకు అనుకూలం

యర్రగొండపాలెం: నియోజకవర్గంలో అకాల వర్షాలు కురిశాయి. గురువారం సాయంత్రం 4 గంటలు దాటిన తర్వాత దాదాపు గంటన్నర సేపు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఈ వర్షాలతో ఉద్యాన పంటలు పండించే రైతులకు కొంతమేర ఉపశమనం కలిగింది. వేసవి పత్తి విత్తుకునే రైతులకు ఈ వర్షం అనుకూలమని ఉద్యాన శాఖాధికారి పల్లకి ఆదిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో చివర దశలో ఉన్న మిరప, బత్తాయి, నిమ్మ, మామిడి, జామ, అరటి, బొప్పాయి తోటలకు ఎంతో మేలు కలిగిస్తుందన్నారు. పండ్ల తోటల్లో నీరు నిల్వ చేరకుండా చూసుకోవాలని సూచించారు. ఈ వర్షంతో వేసవి దుక్కిలు దున్నుకునేందుకు మంచి అవకాశమని, రైతులు తమ పొలాలను వెంటనే దున్నుకొని రబీ పంటలకు సిద్ధం కావాలని ఏవో కేవీ శేషారెడ్డి కోరారు. అకాల వర్షాలతో జరిగిన పంట నష్టాల గురించి రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందలేదని, శుక్రవారం ఉదయం ఆయా ప్రాంతాలను సందర్శించి రైతులకు తగిన సూచనలు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.

వర్షంతో ఉపశమనం


మండల కేంద్రం పెద్దదోర్నాలలో కురుస్తున్న వర్షం

పెద్దదోర్నాల: కొద్ది రోజులుగా మండుటెండలు, ఉక్కపోతలతో అల్లాడిన మండల ప్రజలు గురువారం కురిసిన కొద్దిపాటి వర్షానికి సేద తీరారు. కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడిన మండల ప్రజలు అకస్మాత్తుగా కురిసిన వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలతో రోడ్లపైకి వచ్చేందుకు భయపడిన మండల ప్రజలు గురువారం కురిసిన వర్షంతో సేద తీరారు. గతంలో ఎండలు ఎక్కువగా ఉండటంతో వీధులన్నీ సాయంత్రం వరకు నిర్మానుష్యంగా కనపడేవి. అయితే గురువారం సాయంత్రం అరగంట పాటు కురిసిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారిపోయింది. దీంతో వేడి వాతావరణం స్థానంలో చల్లటి గాలులు వీస్తుండటంతో ప్రజలు రోడ్లపైకి చేరుకొని చల్లగాలులను ఆస్వాదించారు.

కోచింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి


కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

యర్రగొండపాలెం: ఎంసెట్ కోచింగ్ సెంటర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బి.శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఎంసెట్ కోచింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ పొందాలంటే ఖర్చుతో కూడిన పనని, తమకు సమీపంలోనే ఉచితంగా ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.మల్లికార్జున నాయుడు, ఎంఈవో పి.ఆంజనేయులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పూర్ణకంటి తిరుమలయ్య, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య, ట్రస్ట్ చైర్మన్ సంద్రపాటి విజయకుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు రెండు బీరువాల వితరణ


బీరువాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు రెండు బీరువాలను బహూకరించారు. గురువారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో పాఠశాలలో 1981–82 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.20 వేల విలువ చేసే రెండు బీరువాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అనసూయకు బీరువాలు అందజేసిన విద్యార్థులు ఆమెను ఘనంగా సత్కరించారు. రావిక్రింది సత్యనారాయణ, గ్రంథే సుదర్శనం, ఈదర పెద్ద ఆంజనేయులు, నీరూడి కాశయ్య, షేక్ కాశిం, పెరుమాళ్ల సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, మోహన్‌రావు, కటికల చెన్నయ్య, సుబ్రహ్మణ్యం, గాదె బ్రహ్మారెడ్డి, బొద్దోజు శ్రీనివాసాచారితో పాటు ఉపాధ్యాయులు నాగమూర్తి, రామానాయక్, చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పసుపుగల్లు పొలాల్లో కోత ముక్క ఆడుతున్న ఐదుగురు పేకాటరాయుళ్లను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా పేకాట ఆడితే తమకు సమాచారం అందిస్తే వారి విషయాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై నాగరాజు భరోసా ఇచ్చారు.

రీ సర్వేపై అవగాహన


రీ సర్వేపై అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు


కురిచేడు: ర్యాలీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

కురిచేడు: మండలంలోని దేకనకొండలో రీసర్వే ప్రారంభంపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజనీకుమారి, డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్లు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు: రీ సర్వేతో రైతుల భూసమస్యలు పరిష్కరిస్తామని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ సంజీవరావు తెలిపారు. మండలంలోని విఠలాపురం, బెల్లంకొండవారిపాలెం గ్రామాల్లో అధికారులు రీ సర్వేపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు.

సమావేశం అనంతరం రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సంజీవరావు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్ కోట శివలక్ష్మి, వెంకటరామిరెడ్డి, రీసర్వే డీటీ ప్రశాంత్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, విలేజ్ సర్వేయర్ రాజ్యలక్ష్మి, నాయకులు పెద్ద సుబ్బారెడ్డి, రేపు అశోక్‌రెడ్డి, జే.నరసింహారావు పాల్గొన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం


పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న కార్యదర్శి

కురిచేడు: పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలమని పంచాయతీ కార్యదర్శి మధుబాబు తెలిపారు. మండలంలోని ఆవులమంద పంచాయతీ పరిధి ముష్టల గంగవరంలో డ్రైనేజీల్లోని పూడికతీత పనులను ఆయన పర్యవేక్షించారు. వేసవి కాలం ఆరంభం కావటంతో డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండి దోమల ప్రబలటంతో అనేక రకాల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టామన్నారు. డ్రైనేజీలతో పాటు పరిసరాల్లో కూడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, నైదిబ్బలను గ్రామానికి దూరంగా వేసుకోవాలని, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ చెత్తబండ్లలో వేయాలని ఆయన కోరారు.

వార్డు సభ్యుడి రాజీనామా


రాజీనామా పత్రం అందజేస్తున్న ఒకటో వార్డు సభ్యుడు కొర్రపాటి

తాళ్లూరు: మండలంలోని కొర్రపాటివారిపాలెం పంచాయతీకి చెందిన ఒకటో వార్డు సభ్యుడు కొర్రపాటి వెంకట్రావు తన రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో దారా హనుమంతురావు, పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్‌కు గురువారం అందజేశారు. అతను టీడీపీ మద్దతుదారుడిగా 2021 పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాడు. అదే గ్రామానికి చెందిన సర్పంచ్ కొర్రపాటి శ్రీదేవి ఆమె భర్త రామయ్య గ్రామ అభివృద్ధి జరగకుండా ప్రతి పనిలో అడ్డుకుంటున్నారని, అదేవిధంగా గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నా జేజేఎం పనులు జరగకుండా నిలిపివేశారని, బీసీ శ్మశాన వాటికకు రోడ్డు వేయించిన పనులకు సంబంధించిన వ్యక్తికి బిల్లులు చెల్లించకుండా నిలిపివేశారని, 5 సంవత్సరాల నుంచి గ్రీన్ అంబాసిడర్‌గా పనులు చేస్తున్న ముగ్గురికి జీతాలు చెల్లించకుండా వారిని పనుల నుంచి తొలగించారని పేర్కొంటూ కొర్రపాటి వెంకట్రావు తన రాజీనామా పత్రాన్ని అధికారులకు అందజేశారు.

కందులు దళారులకు అమ్ముకోవద్దు


కందులు పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మీనారాయణ

దొనకొండ: రైతులు తాము పండించిన కందులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మద్దతు ధరకు రూ.7550 అమ్ముకోవాలని, దళారులకు అమ్ముకుని మోసపోవద్దని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. కొనుగోలు కేంద్రంలో అమ్ముకుంటే మంచి ధరతో పాటు నగదు కూడా వెంటనే రెండు రోజుల్లో రైతు బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పడమర కంభంపాడు, ఆరవల్లిపాడులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో 2391 మంది రైతులు 5515 ఎకరాల్లో కంది పంట సాగు చేశారన్నారు. ఇప్పటి వరకు మండలంలో 16 మంది రైతుల నుంచి 250 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసినట్లు వివరించారు. పేర్లు నమోదు చేసుకోకుంటే కందులు అమ్ముకునేందుకు వీలు కాదని ఏఓ స్పష్టం చేశారు.

దర్జాగా ప్రభుత్వ స్థలం ఆక్రమణ


కాలువపల్లెలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలం

రాచర్ల: మండలంలోని కాలువపల్లె గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. మండల కేంద్రమైన రాచర్ల నుంచి కాలువపల్లె గ్రామానికి వెళ్లే దారిలో కొండ తిప్పల వెంట ఉన్న ప్రభుత్వ స్థలాలను చదును చేసి ఆక్రమించుకుంటున్నారు. ఆ స్థలాల్లో పశువుల మేత నిల్వ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అంతేకాక రాచర్ల తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో భూములు ఆక్రమించుకుంటున్నప్పటికీ రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఈ విషయంపై తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లును వివరణ కోరగా 'కాలువపల్లె గ్రామ సమీపంలోని చెరువు తొట్టి భూమి ఆక్రమణను పరిశీలించాం. ఆ భూమి తనదేనని ఆక్రమించిన వ్యక్తి మాట్లాడటంతో డాక్యుమెంట్లు తీసుకుని విచారణకు రావాలని ఆదేశించాం' అని తెలిపారు.

అస్తవ్యస్తంగా సచివాలయాలు!




తలుపులు తెరుచుకోని రైతు సేవా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనం

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సచివాలయానికి వివిధ పనుల కోసం వచ్చిన వారు ఖాళీ కుర్చీలను చూసి వెనుదిరుగుతున్న పరిస్థితి. గురువారం పాములపాడు సచివాలయంలో ఉదయం 10.30 గంటలకు ఒకే ఒక్కరు విధుల్లో ఉన్నారు. కందుల కొనుగోలు కేంద్రం, రైతు సేవా కేంద్రం, హెల్త్ క్లినిక్ తలుపులు తీయలేదు. మధ్యాహ్నం 3.30 గంటలకే సిబ్బంది వెళ్లిపోతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.


ఖాళీగా కందుల కొనుగోలు కేంద్రం


పాములపాడు సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు